క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో జార్తాల్



భక్తులకు ఖాశీంస్వామిని చివరి దర్శనం గావిస్తున్న ముజావర్లు

బత్తలపల్లి: మొహర్రం వేడుకల అనంతరం రెండురోజులకు పెద్దఖాశీంస్వామికి నిర్వహించే జార్తాల్(దినాలు)లను బత్తలపల్లి, పోట్లమర్రి గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లమకాన్ వద్ద స్వాములకు ప్రత్యేక చదివింపులు గావించారు. దీంతో తమ ఇష్టదైవమైన బత్తలపల్లి పెద్ద ఖాశీంస్వామి చివరి దర్శనం చేసుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు చక్కెర చదివించుకున్నారు. చివరి దర్శనం అనంతరం పీర్లను పెట్టెలో భద్రపరిచారు. ముజావర్లు మహబూబ్‌బాషా, కాశీంపీరా, ఫక్రుద్దీన్, కాశీంవలి, పోట్లమర్రిలో ఫక్రుద్దీన్, ఇస్మాయిల్, ఖాదర్‌వలిలు ఖాశీంస్వామికి ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆలయంలోని అటక మీద భద్రపరిచారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఎస్‌ఐ, డాక్టర్

చెన్నేకొత్తపల్లి: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుని డాక్టర్ల సలహాలు పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవి నాయక్ సూచించారు. నాగసముద్రం గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా తొమ్మిదో తేదీన ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రవినాయక్ అన్నారు. ఇందులో భాగంగా హైరిస్క్ గర్భిణులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం గర్భిణులకు ఎస్‌ఐ సత్యనారాయణ భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు నాశనం



పాఠశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తనకల్లు: బాల్య వివాహాలతో చిన్నారుల భవిష్యత్తు నాశనమవుతుందని వక్తలు పేర్కొన్నారు. సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ అధికారులు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా డీసీపీయూ విభాగం ప్రతినిధి మేఘన మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకోవడం వల్ల కుటుంబంతో పాటు సమాజంలోనూ మంచి గుర్తింపు దక్కుతుందన్నారు. తల్లి, తండ్రి లేని చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలల హెల్ప్‌లైన్ -1098, బాలల హక్కులు-చట్టాలు, గుడ్, బ్యాడ్ టచ్, టీనేజ్ ప్రెగ్నెన్సీ తదితర అంశాలపై వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేరీ మార్గరేట్, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ నాగభూషణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఆలయాభివృద్ధికి తోడ్పడదాం

కదిరి టౌన్: సమష్టి కృషితో ఖాద్రీ ఆలయాభివృద్ధికి తోడ్పడదామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అధికారులను కోరారు. బుధవారం ఆయన ఆర్డీఓ వీవీఎస్.శర్మతో కలిసి ఆర్డీఓ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం కింద ఆలయ సుందరీకరణ, అభివృద్ధి పనులపై అర్చకులు, పట్టణ ప్రముఖులు పెద్దలతో సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కోనేరు పనులు చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేస్తామన్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా దర్శనం చేసుకునేలా సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆలయ ఈఓ శ్రీనివాస రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, తహసీల్దార్ మురళీకృష్ణ, ప్రసాద్ కార్యక్రమ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, కుమార్‌స్వామిపాల్గొన్నారు

ఉపాధి పనులపై సమీక్ష

ముదిగుబ్బ: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై బుధవారం ఏపీడీ చలపతి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అడిగిన వారందరికీ పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా చూడాలని ఆదేశించారు. ఎంపీడీఓ దివాకర్, ఏపీఓ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు. .



తనకల్లులో నిరుపయోగంగా బీసీ బాలికల హాస్టల్ భవనం



తనకల్లులో ముళ్లపొదలు, కంపచెట్లతో నిండిపోయిన గిరిజన బాలుర వసతి గృహం

నిరుపయోగంగా హాస్టల్ భవనాలు

- పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయిన వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన భవనాలు



తనకల్లులోని ఎస్సీ బాలుర హాస్టల్ భవనం దుస్థితి

తనకల్లు: మండల కేంద్రంలోని రాచువారిపల్లికి వెళ్లే రోడ్డుకు సమీపంలో నిర్మించిన ప్రభుత్వ హాస్టల్ భవనాలు నిరుపయోగంగా మారాయి. భవనాలన్నీ పిచ్చి మొక్కలు, కంప చెట్లు, చెత్తాచెదారంతో నిండిపోయాయి. వెనుకబడిన విద్యార్థుల సంక్షేమం కోసం దాదాపు 35 ఏళ్ల క్రితం బాలుర వసతి గృహం, ఎస్సీ బాలుర వసతి గృహం, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, బాలికల వసతి గృహాలను ఏర్పాటు చేశారు. వీటి కోసం ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి అన్ని రకాల సౌకర్యాలతో కూడిన పక్కా భవనాలను నిర్మించారు. అయితే మొదట్లో విద్యార్థులతో కళకళలాడిన ఈ వసతి గృహాలు అనంతరం విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడంతో మూత పడ్డాయి. మొత్తం నాలుగు ప్రభుత్వ వసతి గృహాల్లో కేవలం బాలికల వసతి గృహం మాత్రమే నడుస్తోంది. మిగిలిన ఎస్సీ, ఎస్టీ బాలురు, బీసీ బాలికలు ఈ మూడు హాస్టళ్ల విద్యార్థులు లేరు అనే సాకుతో పదిహేనేళ్ల క్రితం మూసివేశారు. దీంతో రూ.లక్షలు ఖర్చు పెట్టి హాస్టళ్ల కోసం నిర్మించిన పక్కా భవనాలు పూర్తిగా నిరుపయోగంగా మారాయి.

చిట్టడవులను తలపిస్తున్న ప్రాంగణాలు..

హాస్టళ్ల ప్రాంగణమంతా ముళ్ల పొదలు, కంప చెట్లతో నిండిపోయి చిట్టడవులను తలపిస్తున్నాయి. వసతి గృహాల్లోని గదులు మందు బాబులకు అడ్డాగా మారాయని స్థానికులు అంటున్నారు. అలాగే హాస్టల్‌లోని తరగతి గదులు, ఇతర గదులు అసాంఘిక కార్యక్రమాలకు కేంద్రంగా మారాయి. ఎక్కడపడితే అక్కడ మందు బాటిళ్లు, వాటర్ బాటిళ్లే కనిపిస్తున్నాయని చుట్టుపక్కల నివాసం ఉంటున్న ప్రజలు పేర్కొంటున్నారు. నిరుపయోగంగా ఉన్న హాస్టల్ భవనాలను ఉపయోగంలోని తీసుకురావాలని ఇప్పటికే ఎన్నో సార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని మండల ప్రజలు తెలియజేశారు.

భవనాలను వినియోగంలోకి తీసుకురావాలి



రూ. లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ హాస్టల్ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలి. ఇప్పటికే పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. భవనాలను అలాగే వదిలేస్తే పూర్తిగా పాడైపోయి ఎందుకు పనికిరాకుండా పోయే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలి.

– శివన్న, సీపీఎం నాయకుడు, తనకల్లు

దోష రహిత ఓటరు జాబితానే లక్ష్యం



మాట్లాడుతున్న డీఏఓ ఖతిజున్‌కుప్రా

ధర్మవరం అర్బన్: దోష రహిత ఓటరు జాబితానే లక్ష్యంగా బీఎల్‌ఓలు పని చేయాలని ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఖతిజున్‌కుప్రా సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు జాబితా తయారీపై బుధవారం ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖతిజున్‌కుప్రా మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 16 వరకూ ఆరు విడతలుగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, బ్యాచ్‌కు 50 మందికి చొప్పున బీఎల్‌ఓలు పాల్గొంటారన్నారు. ఓటర్ల నమోదు తొలగింపులు, సవరణ తదితర విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయడంలో బీఎల్‌ఓలు కీలకపాత్ర వహించాలన్నారు. ఇందులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్నికల ఉప తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డి, ఎన్నికల కార్యాలయ ఆపరేటర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కదిరి టౌన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం కదిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని బీఎల్‌ఓలకు ఓటరు జాబితా తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జాబితా తయారీలో తీసుకోవాల్సిన చర్యలను ఆర్డీఓ వీవీఎస్ శర్మ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీకృష్ణ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర ప్రసాద్, డీటీ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



వార్డులో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం అర్బన్: పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 1న సాక్షిలో 'దోమల దండయాత్ర' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ స్పందించారు. బుధవారం పట్టణంలోని శారదానగర్, జగజ్జీవన్‌రాంనగర్‌లో సిబ్బంది ఫాగింగ్ చేశారు. ప్రతి వార్డులోనూ ఫాగింగ్ చేయిస్తున్నామని కమిషనర్ తెలిపారు.

ముదిగుబ్బ సచివాలయం తనిఖీ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని సచివాలయాన్ని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.జనార్దనరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులతో తల్లికి వందనం, ఆధార్ వెరిఫికేషన్ పెండింగ్ రిపోర్ట్, బర్త్ సర్టిఫికెట్, ఐవీఆర్ఎస్ కాల్స్, ఈ సర్వీస్ అమౌంట్ తదితర వాటిపై ఆరా తీశారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పెడపల్లిలో బుడ్డా సాబ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: మండలంలో పలు గ్రామాల్లో మృతి చెందిన, వివిధ ప్రమాదాలకు గురైన బాధితుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. బత్తలపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి తండ్రి వేమనారాయణరెడ్డి(65) , బీడుపల్లి నరసింహులు(45) అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నేతలు నారాయణరెడ్డి, వడ్డీ మధు, తీవ్రంగా గాయపడిన ఈశ్వరప్ప, అనారోగ్యంతో బాధపడుతున్న జయరాం నాయక్ భార్య సాలీబాయి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పైపల్లిలో మృతి చెందిన కురుబ నంజుండప్ప కుటుంబ సభ్యులను, ఆపరేషన్ తర్వాత ఇంటి వద్ద చికిత్స పొందుతున్న పెడపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రామచంద్ర, పెడపల్లి గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న బుడ్డాసాబ్ , షేక్ మహబూబ్ బాషా భార్య హసీనా, అనారోగ్యంతో బాధపడుతున్న చాకల ప్రసాద్ కుమార్తె పర్లికను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన గంగిరెడ్డిపల్లికి చెందిన ఉపాధి హామీ ఈసీ గంగాధర్ , దిగువచెర్లోపల్లికి చెందిన చెన్నారెడ్డి, ఇటీవల మృతి చెందిన సాతార్లపల్లికి చెందిన కిష్టప్ప కుమారుడు రంగనాథ్ కుటుంబాలను పరామర్శించి భరోసా కల్పించారు. ఎంపీపీ ఏవి రమణారెడ్డి, పుట్టపర్తి మండల, పట్టణ కన్వీనర్లు ఈశ్వరయ్య, రవి నాయక్, మాజీ కన్వీనర్ గంగాద్రి, నాయకులు సతీష్‌రెడ్డి, పూర్ణానంద, నాగభూషణ, మల్లికార్జున, శ్రీనివాసులు, కన్యాకుమారి, మురళీధర్‌రెడ్డి నాగేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



ఎరికిలప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బత్తలపల్లి: కోడేకండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షులు బ్యాల్ల పెద్దయ్య తండ్రి ఎరికిలప్ప(85) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, మాజీ సర్పంచు కప్పల నారాయణస్వామి, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, గుర్రం నరసింహారెడ్డి, ఉపేంద్రరెడ్డి, వెంకటరెడ్డి, రాజవీరారెడ్డి, బండి వీరనారప్ప, బండి నాగభూషణ, సోమశేఖర్, దేవరప్ప, వ్యాపారం పెద్దప్ప, బండి ఆదినారాయణ తదితరులు గ్రామానికి చేరుకుని ఎరికిలప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో పాటు మండల ఉపాధ్యక్షులు బ్యాల్ల పెదయ్యను పరామర్శించారు.

గురుపౌర్ణమి వేడుకలు జయప్రదం చేయండి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాయినగర్‌లో ఉన్న షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం జరిగే పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నామని షిర్డీసాయిబాబా సేవా సమితి అధ్యక్షుడు వీరనారాయణ, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి రామలింగయ్య, ఉప కార్యదర్శి నాయుడు, కోశాధికారి సూర్యనారాయణ, డైరెక్టర్ సూర్యప్రకాష్ కోరారు. ఈమేరకు వారు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు సాయిబాబా పాద దర్శనం ఉంటుందని తెలిపారు. ఉదయం 5.15 నిమిషాలకు కాగడా హారతి, 6 గంటలకు అభిషేకం, 7 నుంచి రాత్రి 7 గంటల వరకు అఖండ సాయినామ సంకీర్తన, 8 నుంచి సత్యనారాయణస్వామి వ్రతం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని వివరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. బుధవారం పోలీస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి బందోబస్తుపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం సీఎం వెళ్లే కాన్వాయ్ మార్గాలను పరిశీలించి ట్రైల్ రన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం కొత్తచెరువు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ మీట్‌కు హాజరవుతారన్నారు. సత్యసాయి విమానాశ్రయం నుంచి కొత్తచెరువు వరకు పర్యటించే రూట్లు, సీఎం కాన్వాయ్, సభ ప్రాంగణంలో తదితర ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించే పోలీస్ అధికారులు, ఎస్‌బీ, మఫ్టీ, స్పెషల్ పార్టీ బృందాలు, పోలీస్ జాగిలాలు, బాంబ్ స్క్వాడ్ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫుడ్ కోర్టు, పార్కింగ్ వాహనాలు, ట్రాఫిక్ ప్రాంతాలలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకొని సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీలు హుస్సేన్‌పీరా, ఇలియాజ్ అహమ్మద్, డీఎస్పీలు విజయకుమార్, నరసింగప్ప, శివనారాయణ స్వామి, కేశ మహేష్, హేమంత్‌కుమార్, మహబూబ్ బాషా, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీటీ సమస్యపై సీఎంను అడ్డుకుంటాం

ప్రశాంతి నిలయం/ కొత్తచెరువు: ఆర్డీటీ సమస్యపై సీఎం చంద్రబాబును అడ్డుకుంటామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ప్రకటించారు. సీఎం చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించేందుకు అనుమతించకపోవడంపై బుధవారం కొత్తచెరువులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని కోరుతూ సీఎంకు వినతిపత్రం అందజేసేందుకు జిల్లా కలెక్టర్‌కు ఐదు రోజుల క్రితం అనుమతి కోరామన్నారు. కలెక్టర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం బాధ కలిగించిందన్నారు. గురువారం జరిగే సీఎం పర్యటనలో ఆర్డీటీ పరిరక్షణ సమితి జేఏసీ ఆధ్వర్యంలో సేవ్ ఆర్డీటీ పేరుతో వినతిపత్రం ఇస్తామని, అడ్డుకోవాలని చూస్తే సీఎం పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. మాల మహానాడు నాయకులు సోదనపల్లి రామాంజనేయులు, ఎంఎస్ఎఫ్ రవి, దళిత సమాఖ్య నారాయణ, సమతా సైనిక్ దళ్ సుగమంచి శ్రీనివాసులు, జై భీమ్ పార్టీ ఊటుకూరు నాగరాజు, అంబేడ్కర్ సేన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు విడనాడాలి



పుట్టపర్తిలో నిరసన తెలుపుతున్న కార్మికులు



కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి బృందం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరుతూ బుధవారం ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లోని మండల కేంద్రాల్లో కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకులు భారీ ర్యాలీలు చేపట్టారు. మానహారంగా ఏర్పడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసించారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, జేవీవీ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, అంగన్‌వాడీ వర్కర్స్, మున్సిపల్ వర్కర్స్ తదితర సంఘాల నాయకులు, కార్మికులు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయాలయ్యాయి. కోనాపురం గ్రామానికి చెందిన సంజీవ బుధవారం మామిళ్లపల్లి వైపు నుంచి కనగానపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అతని తలకు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి 108 వాహనం ద్వారా ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

చెన్నేకొత్తపల్లి: గ్రంథాలయంలో పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ చెన్నేకొత్తపల్లి గ్రంథాలయ అధికారికి సూచించారు. బుధవారం ఆమె గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ పరిసరరాలను పరిశీలించి గ్రంథాలయ అధికారి జయరాంకు పలు సూచనలు చేశారు.

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కమిటీ రద్దు

ధర్మవరం అర్బన్: ధర్మవరం ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కమిటీని రద్దు చేసినట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో-కన్వీనర్ అయుబ్‌ఖాన్ తెలిపారు. సీఐటీయూ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ ధర్మవరం ప్రాజెక్టు అంగన్‌వాడీ కమిటీని అనివార్య కారణాల వల్ల రద్దు చేశామన్నారు. త్వరలో నూతన కమిటీ ప్రకటిస్తామని తెలిపారు.

బొలెరో వాహనం బోల్తా

నల్లచెరువు: పాత రైల్వేస్టేషన్ సమీపంలో టైర్ పగిలి అదుపుతప్పి బొలెరో వాహనం బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. కదిరి మండలం పంతులకుంట గ్రామానికి చెందిన రంగారెడ్డి అనే రైతు తాను పండించిన టమాట పంటను మొలకలచెరువుకు తరలించేందుకు బుధవారం బొలెరోలో బయలుదేరారు. అయితే పాత రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే టైర్ ఒక్కసారిగా పగిలిపోవంతో వాహనం అదుపుతప్పి జాతీయ రహదారిపై బోల్తాపడింది. ఘటనలో వాహనంలో తరలిస్తున్న పంట పూర్తిగా దెబ్బతినింది. సుమారు రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కనగానపల్లి: ముక్తాపురంలో బుధవారం మొహర్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే పీర్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పీర్లను దర్శించుకుని, చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం తర్వాత పీర్లను జలధికి తరలించారు.

ఆశావర్కర్ పోస్టుకు ఇంటర్వ్యూ

తాడిమర్రి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం డాక్టర్ హరిత ఆధ్వర్యంలో ఆత్మకూరు గ్రామ ఆశా వర్కర్ పోస్టుకు ఇంటర్వ్యూ నిర్వహించారు. గ్రామానికి చెందిన ముగ్గురు యువతులు హాజరుకాగా వారికి పరీక్షతోపాటు ఇంటర్వ్యూ జరిపారు. ముగ్గురి పేర్లను జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓకు పంపుతామని అక్కడ వారిలో ఒకరిని ఎంపిక చేస్తారని డాక్టర్ హరిత తెలిపారు. సీహెచ్‌ఓ లలిత కుమారి, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్, ఏఎన్ఎం లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం

బత్తలపల్లి: మండలంలోని బత్తలపల్లి, రామాపురం షిర్డీసాయి బాబా ఆలయాల్లో బుధవారం గురుపౌర్ణమికి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆయా ఆలయాల్లో నగర సంకీర్తన, అన్నదానం, భజన కోలాటం, ఉపన్యాసములు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి నుంచి భజన కార్యక్రమం చేపట్టారు. గురువారం ఉదయం 5 గంటల నుంచి మేలుకొలుపు, కాగడా హారతి, ప్రత్యేక అభిషేకం, సత్యవ్రతం, సాయి పూజ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.